# మోటారు వాహనాలు

"మామయ్యగారు వచ్చారా అత్తయ్యగారూ!" అంటూ... ఆదివరాహం ఒకనాటి ఆదివారం పొద్దునే త్రిశూలిగారింటికి వచ్చాడు.

"రావోయ్ ఆదివరాహం. మామయ్యగారు రాత్రి పదిగంటలకి వచ్చారోయ్. రాత్రి చాలాసేపటివరకు నిద్దరపట్టలేదుట. ఇంకా పవళింపు సేవలోనే వున్నారు. మేలుకొలుపు పాడినా లేవడంలేదు" అంది త్రిపథగ.

త్రిశూలి అర్ధదేహాన్ని త్రిపథగ ఇరవై ఐదేళ్ల క్రిందట ఆక్రమించింది. ఆదివరాహం ఆ వీధిలోనే పుట్టి పెరిగి వయసులో రజతోత్సవం జరుపుకున్న యువకుడు. ప్రభుత్వోద్యోగి. త్రిశూలిగారింట్లో చనువుగా వుంటాడు.

"ఈ సంవత్సరమైనా బూర్లు పెట్టవేంటోయ్ ఆదివరాహం?" అడిగింది త్రిపథగ.

"పెడతానండీ పెడతాను. కానీ మామయ్యగారు మళ్లీ ఈ ఊరు వస్తేగానీ పెట్టను. బొబ్బిలిలో వుంటూ రమారమీ ఐదేళ్లు కావస్తోంది. ఇంక మూడేళ్లలో రిటైరవబోతున్నారాయె. రిటైర్మెంట్ ముందైనా ఈ ఊరు ట్రాన్స్‌ఫర్‌చేయించుకోరా?" అన్నాడు ఆదివరాహం.

త్రిశూలి పక్కమీంచి లేచాడు.

"గుడ్‌మార్నింగ్ మామయ్యగారూ! మీ గురించే మాట్లాడుతున్నాను. మరి మీరు ఈ ఊరు రానని శపథం చేసారా?" అడిగాడు ఆదివరాహం.

"వెరీ గుడ్‌మార్నింగూ, నాకు మాత్రం రావాలని లేదుటోయ్ అల్లుడూ. రిక్వెస్టు చేసాను. మరి కాలం ఖర్మం కలసి రావాలి కదా?" అన్నాడు త్రిశూలి.

"ఆయనెందుకొస్తారయ్యా ఈ ఊరు. సత్రవు భోజనం మఠం నిద్రాను. హాయిగా వుందాయనకి. ఇక్కడకొస్తే అన్నీ బాధలే. పొద్దునే బొంకులదిబ్బకెళ్లి కూరలు తేవాలి. గ్యాస్ అయిపోతే గ్యాస్ బుక్ చేయాలి. బొబ్బిలిలో వుంటే గ్యాస్ కబుర్లు ఎన్ని చెప్పుకున్నా ఫర్వాలేదు. ఇక్కడైతే నిజంగా గ్యాస్ తేవాలి. పాతికేళ్ల కిందట వచ్చిందికదా ఈ దాసీది, అన్ని విధాల చాకిరీ చేయడానికి" అంది త్రిపథగ వెటకారంగా.

"ఔను అత్తయ్యా! మామయ్య కొంపదీసి ఒక చిన్నిల్లుగానీ చూసుకున్నారా ఏమిటి? అక్కడ్నుంచి కదలి రానంటున్నారు" అన్నాడు ఆదివరాహం.

"నాకిప్పుడు యాభై ఐదేళ్లు. ఈ వయసులో నాకు చిన్న ఇల్లేంటి అల్లుడూ. నాకూ అత్తయ్యకూ తగువు పెట్టేటట్టున్నావు. నువ్వు చూస్తే తగువు మనిషిలా వున్నావుగానీ తగు మనిషిలా లేవు" అన్నాడు త్రిశూలి.

"యాభై అయిదేళ్లయితే మాత్రం పనికిరారా ఏంటి మామయ్యా. ఈ వయసులో కొందరు రెండో పెళ్లి చేసుకుని పిల్లల్ని కూడా కంటున్నారు."

"అనవోయ్ అను. ఏం చేస్తాం. ఇక కబుర్లు చాలించి టీవీ చూద్దాం" మాట మార్చాడు త్రిశూలి.

టీవీ చూడ్డం అయిపోయాక టీ సేవించి "వెళ్ళొస్తాను అత్తయ్యా. వెళ్లొస్తాను మామయ్యా" అని జారుకున్నాడు ఆదివరాహం.

ఇక్కడా మొదలైంది అసలు కథ.

'మామయ్యగారు ఓ చిన్నిల్లుగాని అక్కడ చూసుకున్నారో ఏమో' అన్న ఆదివరాహం మాట త్రిపథగ మనసులో గింగురుమంది. ఆదివరాహం ఆ వేళ అన్నప్పుడు సీరియస్‌గా తీసుకోలేదామె.

అంతకుముందొకనాడు త్రిశూలి నూట యాభై పెట్టి ఓ చీర కొన్నాడు.

"ఎవరికండీ ఈ చీర?" అడిగింది త్రిపథగ.

"ఇంకెవరికి డాళింగ్. నీకే" అనే సమాధానం వస్తుందనుకుంది వెర్రి బాగుల్ది.

"అక్కడ నా రూమ్ తుడుచే పనిమనిషికి" అన్నాడు త్రిశూలి.

సంవత్సరానికో మాటు పనిమనుషులకు పాత చీరలు ఇవ్వడం అనే ఆనవాయితీ మనలో వున్నదే. అయినా పాత చీర తననడిగి తీసుకెళ్లక కొత్త చీర అందునా పనిసనిషికి కొనడంలో ఆంతర్యం?

"నన్నడిగి పాత చీరేదో తీసుకెళ్లక కొత్త చీరెందుకండీ నూట యాభై పెట్టి తగలెట్టేరు?" అంది త్రిపథగ.

"పోనిద్దూ ఏదో పేదరాలు. ఐదేళ్ల నుంచీ నా రూమ్ తుడుస్తున్నది. సంవత్సరానికో ముప్పయి రూపాయల చొప్పున చూసుకున్నా ఐదేళ్లకీ నూట యాభై అయింది. అది ఎక్కువేం కాదు" అన్నాడు త్రిశూలి.

అది కూడా రీజన్‌బుల్‌గానే వుందికదా అని చాలా లైట్‌గానే తీసుకుంది త్రిపథగ ఆనాడు. అదీకాక వాళ్లాయనకు దానగుణం వుందన్న విషయం ఆమెకు తెలిసిందే. తమ కార్యంబు ఘటించుచున్ పరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్ అని భర్తృహరి చెప్పినట్లు తనకీ పిల్లలకీ ఎటువంటి లోటు చేయలేదు త్రిశూలి.

మరోనాడు నలభై రూపాయలు పెట్టి ముతకరకం నేత చీరొకటి ఇరవై శాతం రిబేట్‌లో కొన్నాడు. "అదెవరికండీ" అంటే "ఓ పేదరాలికి" అన్నాడు.

అప్పుడు కూడా లైట్‌గానే తీసుకుంది త్రిపథగ.

కానీ-

ఇప్పుడామెలో అనుమానం రేకెత్తింది.

నూటయాభై చీర కొన్నప్పుడు పనిమనిషికి అన్నారు.

ఇరవైశాతం రిబేట్‌లో జనతా చీర కొన్నప్పుడు ఇంకో పేదరాలికి అన్నారు. అంటే ఇద్దరు పడతులతో సంబంధం ఏర్పరచుకున్నారా లేక ఒక్కర్తెకే రెండు చీరలూనా?

ఇలా పరిపరి విధాలా ఆలోచించుకుంటూ పడుకుంది త్రిపథగ.

పక్కనే త్రిపథగ దుప్పట్లోనే దూరాడు త్రిశూలి.

"ఇవాళ నుంచీ నా దగ్గర పడుకోకండి. వేరే పడుకోండి. లేదా నేనే కింద పడుకుంటాను" అంది త్రిపథగ విసుగ్గా.

"అదేంటి డాలింగ్? ఇప్పటికిప్పుడు ఏమైందని ఇంత కోపం?" బుజ్జగిస్తూ అడిగాడు త్రిశూలి.

"ఆ చీరలు రెండూ నిజంగా ఎవరికోసం కొన్నారో చెప్పండి."

"చెప్పానుకదా నా రూమ్ తుడిచే పనిమనిషికీ, మరో పేదరాలికీ అని. ఇన్నాళ్ల లేనిది ఇప్పటికిప్పుడు అనుమానం ఎందుకొచ్చింది? ఆదివరాహం ఏదో హాస్యానికంటే నిజం అని నమ్మేశావా?"

"ఏమైనా సరే మీరు చెప్పింది నమ్మను. మీరు నిజం చెప్పేవరకు నా దగ్గర పడుకోవద్దు" అంటూ త్రిపథగ తను కప్పుకున్న దుప్పటిని తన్నింది. సత్యభామలా మాత్రం భర్తని తన్నలేదు.

"నీకు నమ్మాలని వుంటే నమ్ము. లేకపోతే లేదు. నిన్ను నమ్మించవలసిన అగత్యం నాకులేదు" అని త్రిశూలి విసురుగా వెళ్లిపోయాడు.

ప్రతి శుక్రవారాంతానికీ ఇంటికి వచ్చే త్రిశూలి ఈ శుక్రవారం ఇంటికి రాలేదు. అర్ధాంగి అయిన త్రిపథగలో క్రమ్మిన మబ్బులు తొలగిపోయేవరకూ వెళ్లకూడదనుకున్నాడు.

అప్పుడప్పుడు భార్యాభర్తల్లో చిన్న చిన్న అలకలు, కలతలు, ఎడబాట్లు లేకపోతే అందంలేదు. జీవితం నిస్సారంగా వుంటుంది. ఆ ఎడబాట్లవల్లే కోపతాపాలు చల్లారి దంపతుల్లో పరివర్తన వస్తుంది. పునరాలోచన వస్తుంది. పునస్సమాగమానికి తహతహలాడతారు. జీవితాంతం అన్యోన్యంగా వుంటున్నా బోర్ కొడుతుంది.

ఆ నెలంతా రాలేదు. త్రిశూలి. త్రిపథగలో ఆందోళన ప్రారంభమైంది.

అనకాపల్లిలో లెక్చరర్‌గా పనిచేస్తున్న త్రిపథగ చెల్లెలు శుభాంగి వచ్చింది. అక్కని కుశలప్రశ్నలు వేసింది.

"బావగారేరి?" అంది.

త్రిపథగ జరిగింది చెప్పింది.

"ఎంత పొరపాటు చేసావక్కయ్యా! మొన్న ఇన్‌విజిలేషన్‌కి బొబ్బిలి వెళ్లాను. బావగారి రూమ్‌కెళ్లాను. ఆ పనిమనిషి డైబ్బై ఏళ్ల వృద్ధురాలు. తల్లితో సమానం. జీవనాధారం ఏదీలేక ఊడిగం చేస్తోంది. ఇక మరో పేదరాలికి జనతా చీర కొన్నారే? ఆమె కూడా ఒక ముసలి బిచ్చకత్తె. మహాకవి శ్రీశ్రీ వర్ణించిన భిక్షువర్షీయసి. బావగారు ఆమెకు చీర కొన్న కొద్దిరోజులకే ఆమె మహాప్రస్థానం చెందింది" వివరించింది శుభాంగి.

త్రిపథగ అనవసరంగా భర్తను అనుమానించి అవమానించినందుకు మథనపడింది. భర్తను ఏమని, ఎలా క్షమించమని అడగాలో తగినంత భాష కూడా ఆమె దగ్గరలేదు. గొంతు మూగవోయింది. కళ్ల వెంబడి నీళ్లు తిరిగాయి.

చెల్లిని బ్రతిమాలి బావగార్ని తీసుకురమ్మంది.

త్రిశూలి రానే వచ్చాడు. త్రిపథగ భర్త కాళ్లని కన్నీటితో కడిగింది.

ఐతే త్రిశూలివద్ద భార్యను ఎలా ఓదార్చి క్షమించాలో తగినంత భాషవుంది. ఉపమించే ఉపశమించే చమక్కులున్నాయి.

"రైలు పట్టాలు సాఫీగా వుంటాయి. ఏ ఒడిదుడుకులు లేకుండా రైలుబండి పరుగెడుతుంది. ఎదురుగా మరో రైలు వచ్చి ఢీకొంటుందనే బెంగలోదు దానికి.

అదే మోటారు వాహనం అయితే? రోడ్లు ఎత్తుపల్లాలు. గతుకులు, వచ్చిపోయే బళ్లను తప్పించుకుంటూ వెళ్లాలి. రైల్వే లెవెల్ క్రాసింగ్ ఉంటే ఆ టైముకి ఒకవేళ రైలుబండి వస్తుంటే గేటు వేసేస్తారు. ఆ గేటు తీసేవరకూ మోటారు వాహనాలు వెళ్లవు. ఈ సమస్య రైళ్లకులేదు. ఝూమ్మని దూసుకుపోతాయి. ఇలాంటి మోటారు వాహనాలవంటి జీవితాలు మనవి" అంటూ త్రిశూలి త్రిపథగను తన దగ్గరకు తీసుకున్నాడు.

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 6-3-1997